# కేసీఆర్ సభలు సూపర్‌హిట్

## వర్ధన్నపేట, మానుకోటలో జనహోరు... గులాబీ వనాన్ని తలపించిన పాలేరు

- ప్రజా ఆశీర్వాదసభలకు జనమే జనం
- సీఎం కేసీఆర్‌ను చూసేందుకు గంట ముందే సభా ప్రాంగణాల్లోకి ప్రజలు
- 'హ్యాట్రిక్ సీఎం కేసీఆర్' అంటూ హోరెత్తిన నినాదాలు
- 'గులాబీల జెండలే' పాటపై చిందులు

మహబూబాబాద్‌లోని శనిగరపురంలో శుక్రవారం జరిగిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన అశేష జనసందోహం

> ఇసుకేస్తే రాలనంత జనం.. ఎటుచూసినా జన ప్రభంజనం.. బస్సులు, ట్రాక్టర్లు, కార్లు, ఆటోలు, ట్రాలీలు, మోటారు సైకిళ్లపై పెద్ద సంఖ్యలో తరలిరావడంతో బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలు కిక్కిరిసి పోయాయి. ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి కేసీఆర్ సభలను సూపర్ హిట్ చేశారు. ఎండను సైతం లెక్కచేయకుండా క్రమశిక్షణతో కేసీఆర్ కోసం వేచిచూసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. కేసీఆర్ ప్రసంగిస్తున్నంతసేపూ ఈలలు, చప్పట్లతో సభా ప్రాంగణాలు మార్మోగాయి.

వరంగల్, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజా ఆశీర్వాదసభ గ్రేటర్ వరంగల్‌లోని భట్టుపల్లిలో, మహబూబాబాద్ ప్రజా ఆశీర్వాదసభ పట్టణంలోని శనిగరపురంలో శుక్రవారం నిర్వహించారు. రెండు సభలకు ప్రజలు, ఉద్యమకారులు, మహిళలు, బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వర్ధన్నపేట సభకు వచ్చిన వారితో వరంగల్ నగర శివారు.. మహబూబాబాద్ సభలకు వచ్చిన వారితో ఆ పట్టణం జనమమయ్యాయి. ఆశీర్వాదసభకు వందల వాహనాల్లో భారీగా జనం తరలి వచ్చారు. సీఎం రాకముందే సభ ప్రాంగణాలు మొత్తం జనంతో నిండిపోయాయి. ముఖ్యమంత్రి కేసీఆర్ వేదికపైకి వస్తుండగా, ఆయన ప్రసంగం సమయంలో, తిరిగి వెళ్లేటప్పుడు 'హ్యాట్రిక్ సీఎం కేసీఆర్' నినాదాలతో సభలు హోరెత్తాయి. కేసీఆర్ ప్రసంగం ఆద్యంతం ఆలకించిన జనం చప్పట్లతో హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న తీరును కేసీఆర్ సభలో వివరించారు. రైతుబంధు, దళితబంధు పథకాలను పుట్టించిందే కేసీఆర్ అని అనడంతో జనం ఈలలు, చప్పట్లతో హర్షం వ్యక్తంచేశారు. ప్రతి వర్గాన్ని సమానంగా చూస్తున్నామని, అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని చెప్పినప్పుడూ ఇదే స్పందన వచ్చింది. దేశంలో వెయ్యికిపైగా గురుకులాలను ఏర్పాటు చేసిన రాష్ట్రం తెలంగాణ ఒక్కటేనని, ఈ సంస్థల్లో చదివిన వారు అద్భుతంగా ర్యాంకులు సాధిస్తున్నారని కేసీఆర్ చెప్పినప్పుడు సభలో చప్పట్లు మార్మోగాయి. రైతుబంధు, 24 గంటల కరెంటు, ధరణి ఉండాలా? వద్దా? అని ప్రశ్నించగా.. అందరూ ముక్తకంఠంతో ఉండాలని గట్టిగా నినదించారు. వరంగల్ నగరాన్ని అద్భుతంగా అభివృద్ధి చేసుకున్నామని, సమష్టి కృషితో మరింత అభివృద్ధి చేసుకుందామని అనగానే చప్పట్లతో స్వాగతించారు. బీఆర్ఎస్ మూడోసారి గెలిచి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆసరా పింఛన్లు పెంచుకుందామని, మహిళలకు భృతి, రైతుబంధు సాయం పెంపు అమలవుతుందని కేసీఆర్ అనగానే అందరూ మద్దతు తెలిపారు. వర్ధన్నపేట సభలో మిట్టపల్లి సురేందర్, ఇతర కళాకారులు... మహబూబాబాద్‌లో మధుప్రియ, మానుకోట ప్రసాద్ ఆట పాటలతో అలరించారు. 'గులాబీల జెండలే రామక్క' పాట అందరిలో ఊపు తెచ్చింది. కళాకారులు ఈ పాట పాడుతున్నంతసేపు జనం చప్పట్లు కొడుతూ కళాకారులతో కలిసిపోయారు. వర్ధన్నపేట బీఆర్ఎస్ అభ్యర్థి అరూరి రమేశ్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎంపీలు పసునూరి దయాకర్, మాలోత్ కవిత, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు కడియం శ్రీహరి, సిరికొండ మధుసూదనాచారి, బస్వరాజు సారయ్య, దేశపతి శ్రీనివాస్, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, నన్నపునేని నరేందర్, గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు నాగుర్ల వెంకటేశ్వర్లు, గ్యాదరి బాలమల్లు, వరంగల్ జడ్పీ చైర్‌పర్సన్లు గండ్ర జ్యోతి, అంగోత్ బిందు పాల్గొన్నారు.

### పరవశించిన పాలేరు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ నిర్వహించిన తొలి ఎన్నికల ప్రచార సభ గ్రాండ్ సక్సెస్ అయ్యింది. పాలేరు నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల నుంచి భారీగా ప్రజలు తరలివచ్చారు. ఈ సభ గులాబీ శ్రేణుల్లో నూతన ఉత్తేజాన్ని నింపింది. మిట్ట మధ్యాహ్నం నడినెత్తిన ఎండ పోటెత్తుతున్నా లెక్కచేయకుండా ప్రజలు సీఎం ప్రసంగం కోసం ఎదురు చూశారు. కేసీఆర్ అడుగుపెట్టగానే సంక్షేమ సారథిని చూసి పాలేరు జనం పులకించిపోయారు. కేసీఆర్ ప్రసంగాన్ని ఆద్యంతం ఆసక్తితో ఆలకించారు. సభలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, బీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, దేశపతి శ్రీనివాస్, వైరా శాసనసభ్యుడు రాములునాయక్, బీఆర్ఎస్ వైరా ఎమ్మెల్యే అభ్యర్థి బానోతు మదన్‌లాల్, డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే ముఖ్యం: కందాళ

ఖమ్మం, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): తనకు రాజకీయాల కంటే ప్రజా సంక్షేమమే ముఖ్యమని బీఆర్ఎస్ పాలేరు ఎమ్మెల్యే అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నిర్వహించిన పాలేరు ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడారు. 'మంచి మనసున్న ముఖ్యమంత్రి కేసీఆర్. ఆయన విజన్‌తోనే నిరుపేదలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయి. నేను నిత్యం ప్రజల మధ్య ఉంటున్నా. వారితో కలిసి పని చేస్తున్నా. ప్రజల్లో ఒకడిగా ఉంటున్నా. ప్రజలు ఏ ఆపద వచ్చినా నాకు ఫోన్ చేయవచ్చు. నా ఫోన్ నంబర్ ప్రజలందరి వద్ద ఉండాలి' అని పేర్కొన్నారు. పాలేరు నియోజకవర్గంలో ఎక్కువ మంది ఎస్సీలు ఉన్నారని, వారందరికీ దళితబంధు వర్తింపజేయాలని సీఎం కేసీఆర్‌ను కోరారు. తిరుమలాయపాలెం, రూరల్ మండలాలను విభజించి పాలేరులో మరో రెండు కొత్త మండలాలు ఇవ్వాలని, కూసుమంచి పీహెచ్‌సీని 50 పడకలను అప్‌గ్రేడ్ చేయాలని, పాలేరును రెవెన్యూ డివిజన్‌గా మార్చాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు తనను ఆశీర్వదిస్తే పుట్టిన గడ్డ రుణం తీర్చుకుంటానని చెప్పారు.

## సీఎం ఆశీస్సులతో మరింత అభివృద్ధి: శంకర్‌నాయక్

మహబూబాబాద్, అక్టోబర్ 27: సీఎం కేసీఆర్ ఆశీస్సులతో మహబూబాబాద్ ఇప్పటికే అభివృద్ధి చెందిందని, కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంగా గెలిపించుకొని మరింత అభివృద్ధి చేసుకొందామని ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లాకేంద్రాన్ని ఇండస్ట్రియల్ హబ్‌గా తీర్చిదిద్దాలని సీఎం కేసీఆర్‌ను కోరారు. శుక్రవారం ఆయన శనిగపురం రోడ్డులో నిర్వహించిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఇప్పటికే మానుకోటను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దారని తెలిపారు. మెడికల్, నర్సింగ్, హార్టికల్చర్ డిగ్రీ కాలేజీ, జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కాలేజీలను మంజూరు చేసిన కేసీఆర్ రుణాన్ని ఇక్కడి ప్రజలు తీర్చుకుంటారని చెప్పారు. గిరిజనులకు పోడు పట్టాలు, 10 శాతం రిజర్వేషన్ కల్పించి ఎన్నో ఏండ్ల కల నెరవేర్చారని తెలిపారు. అమ్మా, నాన్న తనకు జన్మనిస్తే.. సీఎం కేసీఆర్ తనకు రాజకీయంగా పునర్జన్మనిచ్చారని, ఆయన రుణం తీర్చుకొనేందుకు కృషి చేస్తానని చెప్పారు.

## సీఎం కేసీఆర్ పాలనలో సంక్షేమ ఫలం: అరూరి

హనుమకొండ, అక్టోబర్ 27: సీఎం కేసీఆర్ సహకారంతో వర్ధన్నపేటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని ఆ నియోజకవర్గ అభ్యర్థి అరూరి రమేశ్ పేర్కొన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే రెండుసార్లు భారీ మెజార్టీతో గెలిపించిన ప్రజల రుణం తీర్చుకోలేనిదని పేర్కొన్నారు. మూడోసారి తనను ఆశీర్వదించేందుకు వచ్చినందుకు అందరికీ చేతులెత్తి నమస్కరిస్తున్నానని చెప్పారు. సీఎం కేసీఆర్ పాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు నియోజకవర్గంలోని ఇంటింటికీ.. గడపగడపకూ అందుతున్నాయని తెలిపారు. తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించామని, వంద పడకల దవాఖాన ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఆకేరు వాగుపై చెక్‌డ్యాం నిర్మాణం చేపట్టామని, కోట్లాది రూపాయలతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేసినట్టు తెలిపారు. మరోసారి ప్రజలు ఆశీర్వదించి, భారీ మెజార్టీతో గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధిపథంలో ముందుకు తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

మెండోరాలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

## కేసీఆర్ పాలనతో పదిలంగా తెలంగాణ

- అధికారం కోసం కాంగ్రెస్, బీజేపీ వెంపర్లాట: మంత్రి వేముల

మెండోరా/ముప్కాల్, అక్టోబర్ 27 : పుట్టిన బిడ్డ తల్లి ఒడిలో పదిలంగా ఉన్నట్టు కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ కేసీఆర్ పాలనతో పదిలంగా ఉన్నదని రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ సంక్షేమం కోసం కేసీఆర్ ఆరాటపడుతుంటే అధికారం కోసం కాంగ్రెస్, బీజేపీలు వెంపర్లాడుతున్నాయని మండిపడ్డారు. వాళ్లు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఏమీ చేయరు, తెలంగాణలో మాత్రం అన్ని ఇస్తామని ప్రగల్భాలు పలుకుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గంలోని ముప్కాల్, మెండోరా మండలాల బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం శుక్రవారం ఆయా మండలాల్లో నిర్వహించారు. ఈ సమావేశాలకు మంత్రి వేములతోపాటు రాజ్యసభ సభ్యుడు సురేశ్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 60 ఏండ్లు అరిగోసపెట్టి నేడు గ్యారెంటీల పేరుతో వస్తున్న కాంగ్రెస్ నేతలు మోసపు హామీలు నమ్మొద్దని సూచించారు. సమావేశాల్లో హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మధుశేఖర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కోటపాటి నర్సింహనాయుడు తదితరులు పాల్గొన్నారు.

### రేపు బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం

హైదరాబాద్, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యవర్గం, జిల్లా కో-ఆర్డినేటర్స్, నియోజకవర్గ ప్రతినిధుల సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్టు బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించే ఈ సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతారన్నారు.

మాజీ ఎమ్మెల్సీ సావిత్రమ్మకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం కేసీఆర్, చిత్రంలో మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతి రాథోడ్ తదితరులు

## గులాబీ గూటికి మాజీ ఎమ్మెల్సీ

కేసముద్రం, అక్టోబర్ 27 : మహబూబాబాద్‌లో శుక్రవారం జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ సమక్షంలో టీడీపీ మాజీ ఎమ్మెల్సీ గండు సావిత్రమ్మ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆమెకు సీఎం కేసీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలకేంద్రానికి చెందిన సావిత్రమ్మ టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో ఎమ్మెల్సీగా పనిచేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత తెలుగుదేశంలోనే ఉన్న ఆమె సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులైన బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్టు తెలిపారు. ఇనుగుర్తి ప్రజల దశాబ్దాల కోరిక సీఎం కేసీఆర్ వల్లే సాధ్యమైందని, ప్రజల ఆకాంక్ష మేరకు ఇనుగుర్తిని మండలకేంద్రంగా ప్రకటించడం సంతోషంగా ఉన్నదని చెప్పారు.

## త్వరలోనే బరాజ్ పునరుద్ధరణ పనులు

- తొలుత కాఫర్ డ్యామ్ నిర్మాణం
- ఇసుక కదలికల వల్లే కుంగుబాటు
- నాణ్యత, డిజైన్, నిర్వహణ లోపాల్లేవు
- పూర్తిస్థాయి దర్యాప్తు తర్వాతే తదుపరి పనులు
- సాగునీటిపారుదలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్
- నేడు బరాజ్‌ను పరిశీలించనున్న డ్యామ్ సేఫ్టీ రివ్యూ కమిటీ

హైదరాబాద్, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ): లక్ష్మీబరాజ్ పునరుద్ధరణ పనులు త్వరలోనే ప్రారంభిస్తామని సాగునీటి పారుదలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్ వెల్లడించారు. బరాజ్ నిర్మాణంలో ఎలాంటి నాణ్యత, డిజైన్ లోపాలు లేవని, ఇసుక కదలిక వల్లే బరాజ్‌లోని 7వ బ్లాక్ పియర్లు స్వల్పంగా కుంగాయని వివరించారు. ఈ ఘటనపై ఇరిగేషన్ ఉన్నతాధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. బరాజ్ కుంగుబాటుకు సంబంధించిన సాంకేతిక అంశాలపై చర్చించారు. తదుపరి తీసుకోవాల్సిన చర్యలపైనా సమాలోచనలు జరిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పియర్ల కుంగుబాటుపై అధ్యయనానికి వచ్చిన నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ బృందానికి సాంకేతిక వివరాలు అందజేసినట్టు చెప్పారు. తొలుత కాఫర్‌డ్యామ్ నిర్మాణం ప్రారంభించి, తర్వాత పియర్స్ వద్ద నీరు లేకుండాచేసి పూర్తిస్థాయి దర్యాప్తు చేస్తామని తెలిపారు. సమావేశంలో ఈఎన్సీ మురళీధర్, రామగుండం ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు, ఓఅండ్‌ఎం ఈఎన్సీ నాగేందర్‌రావు, సీడీవో సీఈ మోహన్‌కుమార్, ఈఎన్సీ అనిల్, సీఎం ఓఎస్డీ శ్రీధర్‌రావు దేశ్‌పాండేతో పాటు ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

### డీఎస్ఆర్ ప్యానెల్ నేడు బరాజ్ సందర్శన

బరాజ్ కుంగుబాటుపై సాంకేతిక కారణాలను అధ్యయం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానెల్ నేడు బరాజ్‌ను సందర్శించి సాంకేతిక అంశాలను పరిశీలిస్తుంది. మరోవైపు, అంతర్రాష్ట్ర జలవిభాగం అధికారులతో రజత్‌కుమార్ ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ట్రిబ్యునల్ విచారణకు సంబంధించి తదుపరి చేపట్టాల్సిన చర్యలపై వారితో సమాలోచనలు జరిపారు. సమావేశంలో అంతర్రాష్ట్ర జలవిభాగం సీఈ మోహన్‌కుమార్, ఎస్ఈ కోటేశ్వర్‌రావు, సల్లా విజయ్‌కుమార్, సుబ్రహ్మణ్యప్రసాద్ పాల్గొన్నారు.

## బీసీలకు మళ్లీ మొండిచెయ్యే

### కేసీఆర్‌కు దివ్యాంగుల సంపూర్ణ మద్దతు

- రాష్ట్రవ్యాప్తంగా దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనాలు
- దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి

హైదరాబాద్, అక్టోబర్27 (నమస్తే తెలంగాణ): తమ అభ్యున్నతికి, సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, బీఆర్ఎస్ పార్టీకి దివ్యాంగులంతా మద్దతుగా నిలవాలని రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపే ధ్యేయంగా రాష్ట్రవ్యాప్తంగా ఆత్మీయ సమ్మేళనాలను, సీఎం కృతజ్ఞత సభలను నిర్వహించనున్నట్టు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి విడతలో 27 రోజుల్లో 51 నియోజకవర్గాల్లో ఈ సమావేశాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. గడిచిన తొమ్మిదిన్నరేండ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి చేపట్టిన కార్యక్రమాలను వివరిస్తామని, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు మద్దతు కూడగడతామని పేర్కొన్నారు.

మొదటిపేజీ తరువాయి...

మాత్రమే చోటిచ్చింది. బీసీ నేతలైన మధుయాష్కీగౌడ్, పొన్నం ప్రభాకర్‌కు సీట్లు కేటాయించి చేతులు దులుపుకున్నది.

### కొత్తవారి కోసం పాత నేతల బలి

కాంగ్రెస్ ఇప్పటి వరకు ప్రకటించిన 100 స్థానాల్లో 30 మంది కొత్తవారే ఉండడంతో పార్టీ నేతలు రగిలిపోతున్నారు. కష్టపడి పనిచేస్తే టికెట్లు ఇస్తామని నమ్మించి ఇప్పుడీ నమ్మక ద్రోహం ఏంటంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొత్తవారి కోసం తమను బలిచ్చారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు టికెట్ పక్కా అని ఆశలు పెట్టుకున్న వారు ఇప్పుడు తమ పేరు ఉండాల్సిన స్థానంలో మరో నేత పేరు ఉండడంతో దిక్కుతోచని స్థితిలో పడిపోయారు.

### పార్టీ సేవకు దక్కిన ఛీత్కారం

పార్టీ కోసం ఏండ్ల తరబడి సేవ చేస్తున్న వారికి కాకుండా నిన్నమొన్న వచ్చిన వారికి పార్టీ అధిష్ఠానం టికెట్లు కేటాయించింది. రెండు రోజుల క్రితం పార్టీలో చేరిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, బండి రమేశ్, మెన్నం శ్రీనివాస్‌రెడ్డి వంటివారికి టికెట్లు కేటాయించింది. పార్టీలో ఏండ్ల తరబడి ఉన్నా సీటు దక్కని నేతల్లో విష్ణువర్ధన్‌రెడ్డి, బల్మూరి వెంకట్, అంబర్‌పేట నుంచి లక్ష్మణ్‌యాదవ్, నూతి శ్రీకాంత్, ఎల్లారెడ్డి నుంచి సుభాష్‌రెడ్డి, ఎల్‌బీనగర్ నుంచి మల్‌రెడ్డి రాంరెడ్డి, జక్కిడి ప్రభాకర్, హుస్నాబాద్ నుంచి అలిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, ఆదిలాబాద్ నుంచి గండ్ర సుజాత, షాజీద్‌ఖాన్, ఆసిఫాబాద్ నుంచి సరస్వతి, మక్తల్ నుంచి ఎర్ర శేఖర్, వనపర్తి నుంచి శివశంకర్‌రెడ్డి, మేఘారెడ్డి, మహబూబాబాద్ నుంచి బలరాం నాయక్, పరకాల నుంచి గాజర్ల అశోక్, మునుగోడు నుంచి పాల్వాయి స్రవంతి, చెలమల కృష్ణారెడ్డి, పున్నా కైలాశ్‌నేత, పినపాక నుంచి సూర్యం, వరంగల్ వెస్ట్ నుంచి జంగా రాఘవరెడ్డి, మహేశ్వరం నుంచి పారిజాత రెడ్డి వంటి వారు ఉన్నారు.

### పొద్దున చేరితే సాయంత్రం టికెట్ ఇస్తారా

> పొద్దున చేరిన నేతలకు సాయంత్రం టికెట్ ఇస్తే.. ఐదేండ్లు పార్టీ జెండా ఎందుకు మోయాలి? పార్టీ కోసం కష్టపడి పనిచేయాలని చెప్పే నైతిక హక్కును కాంగ్రెస్ పార్టీ కోల్పోయింది.
>
> -జీ నిరంజన్, టీపీసీసీ నేత

### రగిలిపోతున్న అసంతృప్త నేతలు

అభ్యర్థుల రెండో జాబితా కాంగ్రెస్‌లో ప్రకంపనలు సృష్టించేలా కనిపిస్తున్నది. పెద్దగా పోటీ లేని తొలి జాబితా ప్రకటించినప్పుడే అంత రచ్చ జరిగితే ఇప్పుడిక గాంధీభవన్‌కు తాళం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. కొందరు కీలక నేతలు పార్టీని వీడేందుకు కూడా సిద్ధపడుతున్నట్టు తెలిసింది.

### కొత్తగా పార్టీలో చేరి టికెట్ పొందిన నేతలు

ఆదిలాబాద్ – కంది శ్రీనివాస్‌రెడ్డి
ముధోల్– నారాయణరావ్ పాటిల్
నిజామాబాద్ రూరల్– భూపతిరెడ్డి
హుజూరాబాద్– ఒడితెల ప్రణవ్
కూకట్‌పల్లి– బండి రమేశ్
శేరిలింగంపల్లి– జగదీశ్వర్‌గౌడ్
తాండూర్– మనోహర్‌రెడ్డి
ఆసిఫాబాద్ – అజ్మీరా శ్యామ్‌నాయక్
కంటోన్మెంట్– వెన్నెల
మహబూబ్‌నగర్– మెన్నం శ్రీనివాస్‌రెడ్డి
మునుగోడు – రాజగోపాల్‌రెడ్డి
భువనగిరి– కుంభం అనిల్ కుమార్‌రెడ్డి
పాలకుర్తి– యశస్విని
మహబూబాబాద్– మురళీ నాయక్
పరకాల– రేవూరి ప్రకాష్‌రెడ్డి
వర్ధన్నపేట– కేఆర్ నాగరాజు
ఖమ్మం– తుమ్మల నాగేశ్వర్‌రావు
పాలేరు– పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
పినపాక– పాయం వెంకటేశ్వర్లు
బోథ్– వెన్నెల అశోక్

### పార్టీలో ఏండ్లుగా ఉండి టికెట్లు దక్కని నేతలు

జూబ్లీహిల్స్ – విష్ణువర్ధన్‌రెడ్డి
హుజూరాబాద్– బల్మూరి వెంకట్
అంబర్‌పేట– లక్ష్మణ్‌యాదవ్, నూతి శ్రీకాంత్
ఎల్లారెడ్డి– సుభాష్‌రెడ్డి
ఎల్‌బీ నగర్– మల్‌రెడ్డి రాంరెడ్డి, జక్కిడి ప్రభాకర్
హుస్నాబాద్– ప్రవీణ్‌రెడ్డి
సిద్దిపేట– భవానీరెడ్డి
ఆదిలాబాద్– గండ్ర సుజాత, షాజీద్‌ఖాన్
ఆసిఫాబాద్– సరస్వతి
మక్తల్– ఎర్ర శేఖర్
వనపర్తి– శివశంకర్‌రెడ్డి, మేఘారెడ్డి.
మహబూబాబాద్– బలరాంనాయక్
పరకాల– గాజర్ల అశోక్
మునుగోడు– పాల్వాయి స్రవంతి, చెలమల కృష్ణారెడ్డి, పున్నా కైలాశ్‌నేత
పినపాక– సూర్యం
వరంగల్ వెస్ట్– జంగా రాఘవరెడ్డి
మహేశ్వరం– పారిజాతరెడ్డి
వరంగల్ తూర్పు– ఎర్రబెల్లి స్వర్ణ
బోథ్– నరేశ్ జాదవ్, ఆడే గజేందర్